క్లుప్తంగా

సిబ్బందిని రెగ్యులర్ చేయాలి



ప్రచారం చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

ఏలూరు (టూటౌన్) : నగరపాలక, పురపాలక, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని ఎస్ఆర్-2 వద్ద మస్టర్ టైంలో శుక్రవారం ప్రచారం చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఆప్కాస్ సంస్థను రద్దు చేసి ప్రస్తుత కూటమి ప్రభుత్వం తిరిగి ప్రైవేటు వ్యక్తులను కాంట్రాక్టులుగా నియమించడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 24న ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి బి.నారాయణ రావు, సహాయ కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, నాయకులు నారా శ్రీను, ఎస్ సింహాచలం, కందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్): యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్ పిలుపు మేరకు మార్చి 24, 25 తేదీల్లో బ్యాంకు ఉద్యోగులు దేశ వ్యాప్తంగా సమ్మె చేయనున్నట్టు యూఎఫ్‌బీయూ జిల్లా కన్వీనర్ కాశీ శ్రీనివాసరావు తెలిపారు. సమ్మె నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఎన్ఆర్‌పేటలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకుల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, వారంలో ఐదు రోజులు పనిదినాలు కల్పించాలని, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను నిలుపుదల చేయాలని, ఐబీఏతో చేసుకున్న ఒప్పందాల ప్రకారం మిగిలిన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వలే గ్రాట్యూటీ రూ.25 లక్షలు పెంచి ఇన్‌కంటాక్స్‌లో రాయితీ ఇవ్వాలన్నారు. బ్యాంకులను దాడుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐబీఈఏ నాయకులు శ్రీనివాసమోహన్, ఎస్ లక్ష్మణరావు, ఏఐబీఓసీ నాయకులు శ్రీనివాస్, ఎన్‌సీబీఈ నాయకులు రత్నవిమల్, రిటైర్డ్ యూనియన్ నాయకులు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

జాగా ఉందా.. పాగా వేసేస్తారు!

- ఏలూరు నగరంలో యథేచ్ఛగా ఆక్రమణలు
- పార్కు స్థలంలో ఇంటి అక్రమ నిర్మాణం
- చోద్యం చూస్తున్న అధికారులు



బావిశెట్టివారిపేటలోని చిన్న పిల్లల పార్కు స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణం

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏలూరు నగరంలో ఆక్రమణలకు అడ్డులేకుండా పోయింది. ఖాళీ స్థలాలే కాదు పార్కులు, కార్పొరేషన్ స్థలాలనూ ఆక్రమించేస్తున్నారు. అక్రమార్కులకు ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉండటంతో యథేచ్ఛగా ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ఆక్రమణలను అరికట్టాల్సిన నగరపాలక సంస్థ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. మరోపక్క నగరంలో ఇబ్బడిముబ్బిడిగా కొనసాగుతున్న ఆక్రమణలపైనా, ప్రజా సమస్యలపైనా పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదంటూ ఫిర్యాదుదారులు వాపోతున్నారు. ఇటీవల ఆక్రమణలు అరికట్టాలంటూ పర్మినెంట్ లోక్‌అదాలత్‌లో సామాజిక కార్యకర్త ఒకరు ఫిర్యాదు కూడా చేశారు.

పార్కు స్థలంలో పక్కా నిర్మాణం

ఏలూరు 2వ డివిజన్ బావిశెట్టివారిపేటలోని నల్లదిబ్బ ప్రాంతంలో వైఎస్సార్ సీపీ హయాంలో చిన్నపిల్లలు ఆడుకునేందుకు వీలుగా పార్కుకు స్థలం కేటాయించారు. సదరు స్థలంలోని 200 గజాలలో ఇటీవల ఆక్రమణదారులు పక్కా భవన నిర్మాణం చేపట్టారు. దీనిపై స్థానికులు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని చెబుతున్నారు. ప్రజాప్రతినిధుల అండదండలతోనే పార్కు స్థలంలో పక్కా నిర్మాణాన్ని చేపట్టారంటూ విమర్శిస్తున్నారు. నగరంలో ఆక్రమణలు ఎంత వేగంగా జరుగుతున్నాయనే దానికి ఈ ఘటనే ఉదాహరణగా నిలుస్తుంది.

ఆగని అక్రమ కట్టడం

ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని వైఎంహెచ్ఏ హాలు వెనుకవైపు ఉన్న పూలకొట్ల సందులో కార్పొరేషన్ స్థలాన్ని ఒక వ్యక్తి ఆక్రమించుకుని పక్కాగా బిల్డింగ్ నిర్మాణం చేపట్టారు. కొనసాగుతున్న ఈ నిర్మాణంపై కార్పొరేషన్ అధికారులు, జిల్లా కలెక్టర్‌లకు ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టలేదని స్థానికులు చెబుతున్నారు. పైగా ఫిర్యాదులు చేశాక సైతం శ్లాబ్ వేసేందుకు సన్నాహాలు చేయడం విశేషం.

ఆక్రమణలను అరికట్టాలి



నగరంలోని పోరంబోకు, రెవెన్యూ, కార్పొరేషన్ స్థలాల్లో ఆక్రమణలు కొనసాగుతున్నాయి. వీటిని తక్షణం అరికట్టాలి. పేదలు జీవనోపాధి కోసం రోడ్డుపక్కన చిన్నచిన్న దుకాణాలు పెట్టుకుంటే తొలగించే అధికారులకు ఆక్రమణలు కనిపించకపోవడం శోచనీయం.

– వైఎస్పీ శివరావు, వైఎస్సార్‌సీపీ ఏలూరు అసెంబ్లీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి



నగరంలోని అన్ని రకాల ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది. అధికార పార్టీ నాయకులు చెప్పినట్టు వ్యవహరిస్తున్న అధికారుల తీరు మారాలి. విలువైన స్థలాలను కాపాడటంలో అధికార యంత్రాంగం చట్టప్రకారం నడుచుకోవాలి.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు, ఏలూరు

పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): బర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన పౌల్ట్రీ రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో శుక్రవారం ఆయన పౌల్ట్రీ రైతుల సమస్యలపై మాట్లాడారు. నష్టాల్లో ఉన్న పౌల్ట్రీ రైతులు బర్డ్ ఫ్లూతో మరింత నష్టపోయారని చెప్పారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో బర్డ్ ఫ్లూ కారణంగా వంద కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తక్షణం నష్ట పరిహారం ఇచ్చి పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

వారిని కఠినంగా శిక్షించాలి

ఏలూరు(టూటౌన్): తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలో ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని డిమాండ్ చేశారు. నిర్భయ, పోక్సో వంటి చట్టాలు తెచ్చినా చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. నిందితులను శిక్షించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మహిళలు, బాలికలకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టాలన్నారు.

పార్టీ శ్రేణులకు అండగా జగన్



జేసీని కలిసిన ఆర్టీఐ అధ్యక్షుడు రమేష్



జేపీని కలిసిన విద్యార్థి విభాగ అధ్యక్షుడు రాజేష్

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారని, అధినేత నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని పార్టీ ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) అన్నారు. పార్టీ ఏలూరు అసెంబ్లీ ఆర్టీఐ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన బళ్ల రమేష్, పార్టీ ఏలూరు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియమితులైన పాతినవలస రాజేష్ (కరుణ)లు వేర్వేరుగా శుక్రవారం పార్టీ స్థానిక కార్యాలయంలో జేపీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలను అందజేశారు. పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని వారన్నారు. జేపీకి, పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవులు, జిల్లా కార్యదర్శి బత్తిన మస్తాన్ రావు, సీనియర్ మహిళా నాయకురాలు తులసీ వర్మ, నగర వాణిజ్య విభాగం అధ్యక్షుడు పిట్టా ధనుంజయ్, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు మద్దాల ఫణి, వలంటీర్ విభాగం అధ్యక్షులు గణేష్, నేతల కోటి, పేరయ్య, దుర్గ, మోహన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



డిగ్రీ కళాశాలలో బహుమతులు అందించిన అధ్యాపకులు



వైఎంహెచ్ఏ హాలులో తెలుగు తల్లి విగ్రహం వద్ద మాతృభాషా దినోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నగరంలోని పలు విద్యా సంస్థల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ విద్యా బోధనకు, అభ్యసనానికి మాతృభాషకు మించిన సాధనం లేదన్నారు. తెలుగు అధ్యాపకుడు ఎస్ పరమేశ, సీపీడీసీ సభ్యుడు ఎల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం రాంబాబు మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణ అందరి కర్తవ్యమన్నారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

- రామచంద్ర రావుపేట శర్వాణి పాఠశాలలో విద్యార్థులు నృత్యాలు, కవుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. పాఠశాల డైరెక్టర్ మదన్ మోహన్ రాజు, ప్రధానోపాధ్యాయురాలు జి.రత్నకుమారి పాల్గొన్నారు.
- హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్ఏ హాలు ప్రాంగణంలో ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలను వేసి మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాన్ని ఆలపించారు. సంఘ మేనేజ్‌మెంట్ కమిటీ గౌరవ అధ్యక్షుడు అంబికా రాజా, అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, కార్యనిర్వాహక కమిటీ సహాయ కార్యదర్శి ఎల్ వెంకటేశ్వరరావులు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మాతృభాషను గౌరవించుకోవాలన్నారు. యర్రా సోమలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- సర్ సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో తెలుగు శాఖ, సైకలాజికల్ సెల్, ఐక్యూఏసీ విభాగాల ఆధ్వర్యంలో మాతృభాష అభ్యాసం – మనస్తత్వ ప్రభావం అనే అంశంపై కోట శ్రీనివాసరావు అతిథి ఉపన్యాసం చేశారు. తెలుగుకు 2400 ఏళ్ల చరిత్ర ఉందని, తెలుగును ఇటాలియన్ ఆఫ్ ఈస్ట్ అంటారని తెలిపారు. మహిళా కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాధరావు, ప్రిన్సిపాల్ జి.సరళ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.ఝాన్సీలక్ష్మి, తెలుగు హెచ్‌ఓడీ బి.ఈశ్వరి విద్యార్థినులు పాల్గొన్నారు.
- ఇందిరా కాలనీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు తెలుగు తల్లి వేషధారణలో ఆకట్టుకున్నారు. సోషల్ ఉపాధ్యాయుడు గుగ్గులోతు కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు గరికపాటి నాటకోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన గరికపాటి ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో గరికపాటి నాటకోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ గరికపాటి కాళిదాసు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో జరిగే ఈ నాటకోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం అనూహ్యం అనే నాటిక, రాత్రి 8 గంటలకు మరీ అంతొద్దు అనే నాటికలు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. కళాభిమానులంతా పాల్గొనాలని కోరారు.

● బర్త్ సర్టిఫికెట్ కోసం బారులు

బర్త్ సర్టిఫికెట్ కోసం చంటి బిడ్డలతో తల్లులు నానా అవస్థలు పడుతున్న ఈ దృశ్యాలు ఏలూరు జీజీహెచ్ తల్లి పిల్లల వార్డు వద్ద శుక్రవారం దర్శనమిచ్చాయి. దరఖాస్తు నింపి సర్టిఫికెట్లు జారీ చేసే కేంద్రం వద్ద పడిగాపులు పడ్డారు. కూటమి ప్రభుత్వంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం పడిగాపులు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్, ఏలూరు



దరఖాస్తు నింపుతూ.. చంటి బిడ్డతో నిరీక్షణ



జీజీహెచ్‌లో బర్త్ సర్టిఫికెట్ కోసం పడిగాపులు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	14	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	14	చిక్కుడు కాయలు	32
వంకాయలు (కాంతులు)	20	బీన్స్ చిక్కుడు	48
వంకాయలు (తెలుపు)	16	చామదుంపలు	44
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	72
కాకర కాయలు	32	బీట్‌రూట్	30
బీరకాయలు (పందిరి)	48	కీరా దోస	44
కాలీఫ్లవర్	--	ఫ్రెంచ్‌బీన్స్	68
క్యాబేజీ	14	అల్లం	50
క్యారెట్	28	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	34	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	32	గోంగూర	07-10
దోసకాయలు	24	పుదీనా	05
ఆనపకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్	22.30	08
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	22

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	16
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	14
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

అలరించిన మోహినీ భస్మాసుర నాటకం



మోహినీ భస్మాసుర నాటకంలోని ఒక సన్నివేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో రామకోటి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, నిత కల్యాణం నిర్వహించారు. సాయంత్రం హిందూ ధర్మ ప్రచారకుడు ఘంటసాల బసవయ్య ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి శ్యామలాంబ కళానికేతన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన మోహినీ భస్మాసుర పౌరాణిక నాటకం భక్తులను విశేషంగా అలరించింది.

సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక తంగెళ్లమూడి సీతారామ నగర్ చెరువుగట్టుపై నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహాగణపతి, సీతారామచంద్ర స్వామి, కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహికంగా కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీడీ కాలనీ, చెరువుగట్టు, సీతారామ నగర్, తంగెళ్లమూడి, తదితర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. ప్రధాన అర్చకుడు దేవరకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విష్ణ్వేశ్వర పూజ, గోపూజ, పంచగవ్య ప్రాశన పూజలు చేశారు.

హాస్టల్ ఆధునీకరణకు కృషి

దెందులూరు: కొవ్వలి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఆధునీకరణ పనులు వేగంగా నిర్వహిస్తున్నట్టు సాంఘిక సంక్షేమ శాఖ ఎస్‌డబ్ల్యూ బి.రమేష్ అన్నారు. శుక్రవారం హాస్టల్ పనులను ఆయన పరిశీలించారు. పూర్తిస్థాయి నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఏఈ సత్యనారాయణకు సూచించారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు గోల్డెన్ రాజు, కర్ణుడు ఉన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి



లీడ్ బ్యాంకు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కౌలు రైతులు

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని కౌలు రైతులందరికీ పంట రుణాలిచ్చి ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి దొంపా కృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. స్థానిక సీఆర్ఆర్ కాలేజీ వద్ద ఉన్న జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. లీడ్ బ్యాంకు మేనేజర్ నీలాద్రికి వినతిపత్రం అందజేశారు. గుర్తింపు కార్డులు, అన్ని అర్హతలు ఉన్నప్పటికీ బ్యాంకు పంట రుణాలు ఇవ్వకుండా కౌలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. జిల్లాలో 80 శాతం మంది కౌలు రైతులే ఉన్నారని వివరించారు. ఏపీ పంట సాగుదారు హక్కుల చట్టం-2019 ప్రకారం గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులందరికీ హామీ లేకుండానే పంట రుణాలు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ బ్యాంకు ఇవ్వడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గన్ను వెంకట్రావు, బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, నాయకులు నాగం అచ్యుత్, కె.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్ తొలగింపు అన్యాయం



కార్పొరేషన్ ఎదుట ధర్నా నినదిస్తున్న ఆటో కార్మికులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ ఎదుట ఉన్న ఆటోస్టాండ్‌ను తొలగింపును నిరసిస్తూ ఆటో కార్మికులు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్పొరేషన్ వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ ఆటో స్టాండ్ తొలగింపుతో 300 మంది డ్రైవర్లు రోడ్డున పడ్డారన్నారు. ఏలూరు నగరంలో పరిశ్రమలు మూతపడినా నోరు మెదపని పాలకులు స్మార్ట్ సిటీ పేరుతో ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టేందుకు సిద్ధకావడం దారుణమన్నారు. కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమరకుమార్, జె.గోపి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ కనకరావు, ఆటో స్టాండ్ ప్రెసిడెంట్ రాజారావు, కార్యదర్శి సుందరరావు, వైష్ణవ్ ప్రసాద్, సందీప్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వంతోనే విజయం సాధ్యం

దెందులూరు: పోటీతత్వం నిరంతర సాధనతోనే విజయం సాధ్యపడుతుందని కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్ఎం జీఎస్ఎల్ఎన్‌వీ శర్మ అన్నారు. దెందులూరు నియోజకవర్గం గ్రిక్స్ స్పోర్ట్స్ మరియు గేమ్స్ కొవ్వలి జెడ్పీ హైస్కూల్లో ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు జక్కుల సురేష్‌కుమార్, గవ్వ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సుమారు 20 పాఠశాల నుంచి 130 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. దీనిలో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్ పోటీల్లో వివిధ పాఠశాల నుంచి సుమారు 130 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గం పోటీలో విజేతలకు బహుమతులను రామశింగవరం ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జమ్మ రామకృష్ణ ఆర్థిక సహకారం అందజేశారు. దాత ఫిజికల్ డైరెక్టర్ జమ్మ రామకృష్ణను పాఠశాల హెచ్ఎం శర్మ, ఫిజికల్ డైరెక్టర్లు సురేష్ కుమార్, శ్రీనివాసరావు నియోజకవర్గంలోని ఫిజికల్ డైరెక్టర్లు అభినందించారు.

ముంపు ప్రజలను ఆదుకోవాలి

పెదవేగి : మేము ఏజెన్సీకి చెందిన ముంపు ప్రాంత వాసులమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఓ యువకుడు రాష్ట్రమంతా సైకిల్ యాత్ర ప్రారంభించాడు. శుక్రవారం పెదవేగి మండలం దుగ్గిరాల జాతీయ రహదారిలో ఆయన ప్రయాణించాడు. ఈ సందర్భంగా బీరబోయిన శంకర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఏజెన్సీ ప్రాంతం నుంచి వచ్చినట్టు తెలిపారు. పోలవరం గోదావరి వరద ప్రభావిత ప్రజలమని, 30 ఏళ్లు ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తమను ఆదుకోవాలని కోరుతూ రాష్ట్రమంతా సైకిల్ యాత్ర ప్రారంభించినట్టు తెలిపారు. ఇప్పటికి సుమారు 2,500 కిలోమీటర్ల సైకిల్ యాత్ర పూర్తి చేసినట్టు శంకర్ చెప్పారు.